epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 143 | సోమవారం | 28.10.2024




ఆదివారం ఉదయం 6 గంటలకు..




ఆదివారం రాత్రి 8 గంటలకు..

# ఆరని మంటలు

## జనగామలో భారీ అగ్ని ప్రమాదం

- కాలి బూడిదైన షాపింగ్ మాల్స్
- రూ.20 కోట్ల నష్టం
- మంటలను ఆర్పేందుకు 10 గంటలకుపై రెస్క్యూ ఆపరేషన్
- శ్రమించిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది



General News



# ఆరని మంటలు

## జనగామలో భారీ అగ్నిప్రమాదం

- కాలి బూడిదైన షాపింగ్ మాల్స్
- రూ.20 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా..
- మంటలను ఆర్పేందుకు 10 గంటలకుపై రెస్క్యూ ఆపరేషన్
- శ్రమించిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

**జనగామ, మన చౌరాస్తా :**

జనగామ జిల్లా కేంద్రంలోని ఆదివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పట్టణంలో విజయ, శ్రీలక్ష్మి షాపింగ్ మాల్స్‌తో పాటు ఎస్ఆర్ బ్రదర్స్ బట్టల దుకాణం పూర్తిగా కాలి బూడిదైపోయాయి. ఈ ఘటనతో దాదాపు రూ.20 కోట్ల నష్టం వాటినట్లు తెలుస్తోంది. పట్టణానికి చెందిన భోగ భాస్కర్, కైలాసం కొన్నేళ్లగా పట్టణంలో బట్టల వ్యాపారం చేస్తున్నారు. జనగామలో కార్పొరేట్ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ షాపింగ్ మాల్స్‌లో దాదాపు 150 మంది వరకు సిబ్బంది పనిచేస్తున్నారు. శనివారం రాత్రి విజయ షాపింగ్ మాల్ యజమాని భాస్కర్ ఎప్పటిలాగే షాపు మూసి వేసి వెళ్లగా.. ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో షాపులో నుంచి పొగలు వస్తున్నట్టు స్థానికులు గమనించి యజమానితో పాటు పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి సహాయక చర్యలు చేపట్టే లోపు మంటలు మరింత ఎక్కువై పక్కనే ఉన్న శ్రీలక్ష్మి, ఎస్ఆర్ బ్రదర్స్ దుకాణాలకు అంటుకున్నాయి. 40 మంది పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది దాదాపు 10 గంటలకు పైగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారథి, సీఐ దామెదర్‌రెడ్డి ఉదయం నుంచి రాత్రి వరకు ఘటన స్థలంలోనే ఉండి పర్యవేక్షించారు. షార్ట్ సర్క్యూట్ కారణంతో మంటలు చెలరేగి ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రమాదం జరిగిన షాపింగ్ మాల్స్‌లో వరంగల్ నుంచి ఫోరెన్సిక్ టీమ్ ఆధారాలు సేకరించింది.














Local News



# ఘనంగా గజ్జ పూజ

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** నాట్యంలో మొదటి సారిగా గజ్జలు కట్టి చేసే నాట్యాన్ని నటరాజ్ స్వామికి నివేదిస్తారని, దానినే గజ్జ పూజ కార్యక్రమం అంటారని శ్రీచంద్రకళా నిలయం గురు పేరిణి సంతోష్ అన్నారు. బచ్చన్నపేటలోని శ్రీనివాస గార్డెన్స్ లో 13 మంది విద్యార్థులతో నృత్య నీరాజనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్ర నాట్యం, పేరిణికి సంబంధించిన అంశాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో రెండు సంవత్సరాల నుంచి నృత్యం నేర్చుకుంటున్న సీనియర్ విద్యార్థులు పోచంపల్లి రష్మిక, జ్యోత్స్న, హరిణి, అక్షర, దీక్షిత, అక్షిత, అక్షయ, భవిష్ణవి, సహస్రతో పాటు విద్యార్థుల బంధువులు పాల్గొన్నారు.






# రాష్ట్ర స్థాయి కరాటేలో జనగామ విద్యార్థుల ప్రతిభ

**హనుకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా కాజీపేటలో పద్మశాలి భవన్ లో విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలోజనగామ జిల్లా కేంద్రానికి చెందిన విక్టరీ షోటా ఖాన్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు పథకాలు కైవసం చేసుకున్నారని మాస్టర్ ఓరుగంటి సంతోష్ కుమార్ ఒక ప్రకటణలో తెలిపారు. అండర్ 12 సంవత్సరాల పర్పుల్ బెల్ట్ విభాగంలో ఓ అక్షిత్ మణివర్ధన్ బంగారు పథకం, ఆరంజ్ బెల్ట్ విభాగంలో సామ్యూల్ జాన్, జెస్సిక బంగారు పథకాలు, దీక్షిత రజతపథకం, లోహిత్ కాంస్య పథకం గెల్చుకున్నారు. అండర్ 8 సంవత్సరాల విభాగంలో శ్రీరాం, సాయినిధి, వర్షిణి బంగారు పథకాలు సాధించగా అవంతిక, కృత్విక్ రజత పథకాలు సాధించారు. పథకాలు సాధించిన విద్యార్థులను విక్టరీ షోటోఖాన్ కరాటే అకాడమీ ఇండియా చీఫ్ రంగు మల్లికార్జున్ గౌడ్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు నర్మద, విజయ్, మాస్టర్లు సంతోష్ కుమార్, నాగ మహేష్, రామ్మోహన్, చంటి, పాపారావు, ధనరాజ్, రచ్చ శీను, అన్వర్ తదితరులు అభినందించారు.

# డీఏ ప్రకటనతో ఉద్యోగుల్లో అసంతృప్తి

**టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మడూరి వెంకటేశ్**




**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** ఐదు వాయిదాల కరువు భత్యం (డీఏ) పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఒక్క వాయిదాని మాత్రమే విడుదల చేయడం విచారకరమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మడూరి వెంకటేశ్ అన్నారు. ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన పదిహేను రోజుల్లో బకాయి పడిన మూడు వాయిదాల డీఏ విడుదల చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని గత పదినెలలుగా ఓపిక పట్టామన్నారు. తదుపరి మరో రెండు వాయిదాలు బకాయి పడడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైందన్నారు. ఇవ్వాల్సిన సమయంలో డీఏలు ఇవ్వకుండా పండుగలప్పుడు కానుకలుగా ఇస్తున్నట్లు ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యోగుల జేఏసీతో సీఎం జరిపిన చర్చల అనంతరం కనీసం రెండు వాయిదాల డీఏ అయినా ఇప్పుడు ఇస్తారని ఉద్యోగులు భావించారని, మంత్రివర్గం నిర్ణయం కోసం ఆశగా ఎదురు చూశారని పేర్కొన్నారు. కానీ ఒక్క వాయిదా డీఏ మాత్రమే విడుదల చేయడంతో ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం పెట్టే ఖర్చులన్నీ పెడుతూనే ఉద్యోగులకు న్యాయంగా ఇవ్వాల్సిన డీఏలకే ఆర్థిక పరిస్థితి ఆటంకమౌతుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలని వెంకటేశ్ కోరారు.



# మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

బచ్చన్నపేట, మన చౌరాస్తా : ఇటీవల మృతి చెందిన చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి ఆయన మిత్రబృందం ఆర్థిక సాయం అందజేశారు. 1978-80 సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన మిత్రుడు జి.నాగేశ్వర్ అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న ఆయన మిత్రులు అంతా కలిసి నాగేశ్వర్ కుమారుడు సంతోష్‌ను పరామర్శించి రూ.45,350 ఆర్థిక సాయం అందజేశారు. కార్య క్రమంలో ఇ.ప్రతాప్ రెడ్డి, ఎం. వెంకటయ్య, పి.ఆంజనేయులు, డాక్టర్ కె.ప్రభాకర్, రాజేశం, రమేశ్, శంకరయ్య, వెంకటేశం, బి.భిక్షపతి, రామ్మూర్తి, ఏకనాథం, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# సీపీఐ నేత జనార్దన్ కన్నుమూత



**జనగామ, మన చౌరాస్తా :** సీపీఐ జనగామ జిల్లా సీనియర్ నాయకులు మంగళంపల్లి జనార్దన్ ఆదివారం కన్నుమూశారు. పట్టణంలోని సంజయ్ నగర్‌లో ఇంటి వద్ద ఉన్న ఆయన మృతదేహంపై ఎర్రజెండా జెండా కప్పి పలువురు నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, సీపీఐ పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, సీపీఐ సీనియర్ నాయకులు ఎండ్రు వైకుంఠం, సీనియర్ జర్నలిస్ట్ కన్నా పరశురాములు, చింతకింది అరుణ, యునస్, మచ్చ బాలనరసయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కావటి యాదగిరి, ఏం సుదర్శన్, గోల్కొండ నాగరాజు పాల్గొన్నారు.